

# అమెరి'కా'లేజ్

## - లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ - ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*- సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**రాత్రి** మొత్తం కలిపి ఒక రెండు గంటలు పడుకుని ఉంటాను. ఉదయాన్నే లేచిన వెంటనే దేవుడికి దండం పెట్టుకుని టెన్షన్ పడడం మొదలు పెట్టాను. ఇంటర్వ్యూ కాబట్టి ఫార్మల్ వేసుకోవాలని అన్నయ్య కొనిపెట్టిన బట్టలు వేసుకున్నాను. అన్నీ మోకాళ్ళవరకే ఉన్నాయి. అప్పుడే గొడవచేసి పొడుగుది కొనమనాల్సింది. వేసుకునేందుకు సరిగ్గా సరిపోయే ఫార్మల్ లేదని కళ్ళల్లోకి నీళ్ళొచ్చాయి. అన్నయ్యకి ఫోన్ చేసి తిట్టాలనిపించింది కానీ ఆఫీసులో ఉంటాడని చెయ్యలేదు. జీన్స్, గుండీల చొక్కా వేసుకుని హనీష దగ్గరకి వెళ్ళాను.

"ఇది బానే వుందా?" కళ్ళలో నీరు అలానే ఉంది.

'హే, బావుంది. టెన్షన్ అవ్వకు."

"నిజంగా బావుందా?"

"యా. నాకు తెలిసి ఫస్ట్ సెమిస్టర్‌లో మన వాళ్ళల్లో ఇంత ప్రొఫెషనల్‌గా రెడీ అయ్యింది నువ్వే"

"వెటకారమా?" కాస్త కోపంగా అడిగాను.

"కాదు నిజం. అందరూ టీ షర్ట్ మాత్రం వేసుకుంటారు. అమ్మాయిలు కొంతమంది చుడీదార్ వేసుకునే వెళ్తారు" నవ్వింది.

"నిజమా?"

"ఔను"

దాంతో నా మనసు కాస్త కుదుట పడింది. అన్నయ్య మీద కోపం కూడా వెంటనే మాయమయ్యింది. రాత్రి చదివినవే మళ్ళీ చూసుకుంటూ కాళ్ళు కాలిన పిల్లిలా తిరగడం గమనించి "బ్రేక్ ఫాస్ట్ చెయ్యి" హనీష అంది.

"ఒద్దు వచ్చాక ఒకేసారి లంచ్ చేస్తా" అన్నాను.

"మరీ అంత టెన్షన్ పడకు. మీ ప్రొఫెసర్ చాలామందిని హయర్ చేసుకోవాలని చూస్తున్నాడట. నీకు జాబ్ ఇస్తాడులే. డోంట్ వరీ"

"తన ఆఫీస్ ఎక్కడో తెలుసా?"

"ఏరో స్పేస్ బిల్డింగ్‌లో ఉండి ఉంటుంది."

అయోమయంగా తలూపాను.

"నేనూ వస్తాలే నీతోపాటు" అంది.

"థాంక్యూ"

"థాంక్స్ అక్కర్లేదు. జాబ్ వచ్చాక పార్టీ ఇవ్వు, చాలు" అంది.

కాళ్ళు కాలిన పిల్లిలాగా నేను ఇల్లంతా తిరగడం గమనించి, "టెన్షన్ పడకులే వస్తే వచ్చింది, లేకపోతేలేదు. అయినా ఫస్ట్ సెమిస్టర్‌లో ఇంటర్వ్యూ రావడమే గొప్ప" అంది.

"సరే" అని కూర్చుని ఫోన్ ఓపెన్ చేసాను. ఎవరితో మాట్లాడాలనిపించలేదు. తిరిగి ఇంటర్వ్యూకి చదవడం మొదలుపెట్టాను. టైం పదకొండు దాటింది కానీ హనీష ఇంకా తయారవ్వలేదు.

"హాఫెనవరే ఉంది" అన్నాను.

"ఔనా సరే" అంది కానీ కదలనే లేదు.

"ఎంత దూరం?" సహనం కోల్పోకుండా అడ్గాను.

"పక్కనే ఫరవాలేదు. నడుచుకుంటూ వెళ్ళిపోవచ్చు."

"రెడీ అవుతావా?" కాస్త కోపంగా అడిగాను.

"టైం ఉందిలే"

ఇంకో పదినిమిషాలు దాటింది. ఆ తరువాత పదిహేను. ఇంకా కదలనే లేదే? అభిషేక్‌ని బిల్డింగ్ ఎక్కడ అని అడగాల్సింది. అనవసరంగా హనీషని అడిగాను. ఒక్కదాన్నే వెళ్ళినా, దారిలో ఎవరో ఒకళ్ళని కనుక్కునేదాన్ని. ఇంకెప్పుడూ హనీషతో పెట్టుకోకూడదు అనుకుంటుండగా

"పద, వెళ్దాం" అంది.

నేను గబగబా చెప్పులు వేసుకుని తనవైపు అసహనంగా చూసాను. తను నా వెంటే వచ్చి చెప్పులు వేసుకుంటూ తాళం చెవి తీసుకుంది. గుమ్మం ముందు నిలబడినా నా తెల్లమొహాన్ని చూసి, "ఏమైనా మర్చిపోయావా?" అడిగింది.

"లేదు. నువ్వు ఇలానే వస్తావా?" ఆశ్చర్యంగా అడిగాను.

"ఔను"

"ఇది నైట్ డ్రెస్ కదా?"

"ఇక్కడ అంతే ఎవరూ పట్టిచ్చుకోరు. క్లాస్‌కి కూడా ఇలానే వస్తారు చాలామంది"

"ఔనా?" చాలా ఆశ్చర్యమేసింది.

"ఔను. కొంతమంది తలకూడా దువ్వుకోరు"

ఇద్దరం నడవడం మొదలుపెట్టాము. తను అమెరికాకి వచ్చిన మొదట్లో గురైన కల్చర్ షాక్స్ గురించి చెప్పింది.

"కాఫీ కొనాలంటే వాల్‌మార్ట్‌కి వెళ్ళాము. మనలాగా ఒకటో రెండో కాకుండా వంద రకాలున్నాయి. ఫ్రెంచ్ కాఫీ, డార్క్ రోస్ట్, బ్లాండ్ రోస్ట్, ఇంకా ఏవేవో. ఒక ఐల్ మొత్తం కాఫీలే. ఏది తీసుకోవాలో తెలీక చుట్టుపక్కల వాళ్ళు ఏం తీసుకుంటున్నారో చూసాను. చాలామంది తీసుకున్న బ్రాండ్‌లో డీ కేఫ్ కాకుండా ఉన్నది ఏదో తీసుకున్నాను. ఇప్పుడూ గుర్తులేదు. ఇంటికొచ్చి చూస్తే అవి చిన్న కప్పులు. ఒకటి తెరిచి, అందులో ఉన్న పౌడర్‌లో వేణ్ణీళ్ళు కలిపి డికాషన్‌లా చేసాను. అలా ఆ కాఫీని రోజూ తాగుతుంటే ఒకసారి మా ఇంటికొచ్చిన వాళ్ళెవరో చెప్పారు, అది కాఫీ మెషీన్‌లో వాడాలి, అలా తెరిచి పౌడర్ వాడకూడదని. తరవాత వాళ్ళే నాకు నెస్‌కఫే బాటిల్ ఇచ్చారు. అది జరిగిన మూడో, నాలుగో నెలల తరవాత మేము మంచి ఫ్రెండ్స్ అయినప్పుడు చెప్పారు. 'ఈ అమ్మాయి పాపం ఏదో పల్లెటూరనుకుంటా కొంచెం సహాయం చేద్దాం అని జాలిపడి కాఫీ డబ్బా ఇచ్చాము ఇద్దరం ' అని" మేము నవ్వుతుండగా "అదే బిల్డింగ్" అని చూపించింది. రెండు నిమిషాలకన్నా ఎక్కువ నడవలేదు. అందుకే తను పదకొండు దాటింది అన్నా పట్టించుకోలేదేమో. అనవసరంగా తిట్టుకున్నాను.

"నేనూ నీతో లోపలికి వస్తా" అంది.

"ప్రొఫెసర్ ఒప్పుకోరేమో" అన్నాను.

"మీ ప్రొఫెసర్ ఆఫీసుకి కాదు తల్లి, బిల్డింగ్ లోపలికి" మళ్ళీ నవ్వింది.

ప్రొఫెసర్ ఆఫీసులోకి వెళ్ళగానే ఆయన మంచివాడిలా కనబడ్డారు.

"ఆర్ యు అవని?" అడిగారు.

"యస్ సర్. గుడ్ మార్నింగ్" అన్నను.

"ప్లీజ్ సిట్" అని కుర్చీవైపు చూపించారు.

నేను ఎక్కడ చదువుకున్నాను, అమెరికాకి ఎప్పుడు వచ్చాను, జెట్‌లాగ్ ఉందా అని సరదాగా కబుర్లు చెప్పినట్టు అడిగారు. నాకు కాస్త బిడియం తగ్గడం గమనించి ఏరోస్పేస్ ఎందుకు తీసుకున్నానో అడిగారు.

హనీషకి చెప్పినట్టు భీముడి కథ కాకుండా ఉత్త ఇంట్రెస్ట్ వల్ల అని బదులిచ్చాను.

"డు యు నో అభిషేక్?" అడిగారు.

"ఐ మెట్ హిం యెస్టర్‌డే" అన్నాను.

"డిడ్ హి టాక్ అబౌట్ హిజ్ వర్క్?"

"యెస్. హి ఎక్స్‌ప్లెయిండ్ ఎ లిటిల్ బిట్" అన్నాను.

ఏం అర్థమయ్యిందో వివరించమన్నారు. అభిషేక్ చెప్పింది, నేను గూగుల్‌లో చదివింది, ఆయన పేపర్లలో ఉన్నది, అన్నీ ముక్కలుగా చేసి గబగబా పాఠం అప్ప చెప్పినట్టు చెప్పసాగాను. ఓపికగా విని, నేను మాట్లాడ్డం ఆపాక నా చేతికి కొన్ని ప్రింట్ అవుట్లు ఇచ్చి, "రీడ్ దీజ్ ఆర్టికల్స్. విల్ డిస్కస్ టుమారో ఎట్ సేం టైం" అన్నారు.

"డిడ్ ఐ గెట్ ద జాబ్?" అనుకోకుండా నోరు జారాను.

ఆయన నవ్వి "రీడ్ దెం విల్ డిస్కస్ టుమారో" అన్నారు.

అనవసరంగా అడిగాను. దానివల్ల ఇద్దామనుకున్నా ఇవ్వరేమో అని టెన్షన్ మొదలైంది. బిల్డింగ్‌లో హనీష కనబడకపోవడంతో బయటకి వచ్చాను. గమ్మత్తుగా హనీష నా వెనకాలే వచ్చి భుజం తట్టింది కానీ తనని నేను గమనించలేదు.

"ఎలా అయ్యింది?" అడిగింది.

జరిగిన కథంతా వివరించాను.

"కంగ్రాట్స్" అంది.

"దేనికి?"

"జాబ్ వచ్చింది కదా"

"ఇంకాలేదు. రేపు మాట్లాడదాం అన్నారు"

"అంటే సగం వచ్చినట్టే"

"లేదు. ఇంటికెళ్దామా? ఈ పేపర్లు చదవాలి" దీనంగా అన్నాను.

"సరే, పద. అభిషేక్‌కి మెసేజ్ చెయ్యి. ఫ్రీ ఉన్నప్పుడు హెల్ప్ చేస్తాడేమో?"

"గుడ్ ఐడియా థాంక్స్" అంటూ ఆ పేపర్లు చదువుతూ ఇంటికి నడిచాను. అర్ధం చేసుకుని హనీష కూడా ఏమీ మాట్లాడలేదు. అభిషేక్‌కి మెసేజ్ చేస్తే మధ్యాహ్నం మూడింటికల్లా వస్తా అన్నాడు. తను వచ్చేలోపు ఆ ఆర్టికల్స్ చదివి కొంచెన్స్‌ని తయారు చేద్దామని కంకణం కట్టుకుని కూర్చున్నాను. హనీష కూడా కదిలించకుండా తన పని తను చేసుకుంది.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story